సాక్షి
ఒడిశా

గురువారం । 4 । జనవరి । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 3,32,946
బంగారం	4 గ్రాముల 100 మిల్లీ గ్రాములు
వెండి	12 గ్రాముల 200 మిల్లీ గ్రాములు

-భువనేశ్వర్/పూరీ



8 రాష్ట్ర ఉత్పత్తులకు జీఐ ట్యాగ్

రాష్ట్రానికి చెందిన మరో 8 ఉత్పత్తులకు భౌగోళిక సూచిక (జీఐ) మంజూరైంది. చెన్నైకి చెందిన రిజిస్ట్రీ ఈ జీఐ ట్యాగ్‌ని జారీ చేసింది.

- 8లో.



ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

మల్కన్‌గిరి స్టేడియంలో బుధవారం యువ ఒడిశా, నవీన్ ఒడిశా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

- 8లో.

న్యూస్‌రీల్

పుష్పార్చన



చామంతి పువ్వులతో అర్చనలు చేస్తున్న భక్తులు

రాయగడ: ధనుర్మాసం పురస్కరించుకొని స్థానిక బాలాజీ నగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో లక్ష చామంతి పువ్వులతో బుధవారం అర్చన చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు భాస్యరాచార్యులు, రాంజీ ఆచార్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంతకు ముందు స్వామివారికి విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు జరిగాయి.

గ్యాస్ ట్యాంకర్ బోల్తా



బోల్తా పడిన ట్యాంకర్

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌కు సుమారు పది కిలోమీటర్ల దూరంలో నౌడా గేటు సమీపంలో మంగళవారం రాత్రి గ్యాస్ ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా పడింది. రాయగడ నుంచి గజపతి వైపు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో డ్రైవరు సురక్షితంగా బయటపడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ ద్వారా ట్యాంకర్‌ను పక్కకు నెట్టించారు.

వాకర్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



డి.కె.మహంతి

రాయగడ: స్థానిక వాకర్స్ క్లబ్‌కు నూతన కార్యవర్గం ఏర్పాటయ్యింది. క్లబ్ అధ్యక్షునిగా డాక్టర్ డి.కె.మహంతి, ఉపాధ్యక్షులుగా దాశరథి రాజ్‌గురు, బ్రజసుందర్ నాయక్, ప్రభాకర్ దొర, కార్యదర్శిగా రుద్ర ప్రసాద్ చౌదరి, సహ కార్యదర్శిగా హరిశ్చంద్ర సాబొరా, కోశాధికారిగా రాజేంద్ర సాహులు నియమితులయ్యారు. బుధవారం క్లబ్ ప్రాంగణంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కిశోర్ చంద్ర పండా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. సమావేశంలో క్లబ్ సలహాదారులు సత్యవాది పతి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సంఘ భవనానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరావు

పర్లాకిమిడి: స్థానిక శ్రీక్రిష్ణచంద్ర గజపతి కళాశాల ప్రాంగణంలో పూర్వ విద్యార్థుల సంసద్ అతిథి భవనం పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు తన ఎమ్మెల్యే లాడ్ నిధుల నుంచి రూ.5లక్షలు కేటాయించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ పనులకు బుధవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జితేంద్ర పట్నాయక్, అధ్యాపకులు రమాకాంత భుయాన్, పూర్వ విద్యార్థుల సంసద్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాసిర్‌బేగ్, ఉపాధ్యక్షుడు ఆదర్శ దాస్, బసంత్ పండా తదితరులు పాల్గొన్నారు.

మూడు కోవిడ్ కేసులు నమోదు

భువనేశ్వర్: రాష్ట్రంలో కొత్తగా మూడు కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. గత 24 గంటల్లో రోగుల సంఖ్య 27 మందికి పెరిగింది. అధికారిక వర్గాల ప్రకారం వీరందరిలో ఒమిక్రాన్ ఉపవైవిధ్యం జేఎన్.1 ధృవీకరించబడింది. తేలికపాటి లక్షణాలను కలిగి ఉన్నారు. వీరంతా ఇళ్లల్లోనే చికిత్స పొందుతున్నారు.

నిబంధనలు పాటించాలి..

ప్రజలు, ముఖ్యంగా దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వృద్ధులు మాస్క్ ధరించాలని, రద్దీగా ఉండే ప్రదేశాలను సందర్శించకుండా ఉండాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సూచించింది. సాధారణంగా జ్వరం, సాధారణ జలుబు, దగ్గు వంటి లక్షణాలతో బాధపడుతుంటే కోవిడ్ నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలని తెలిపింది.

ఆహార భద్రతే లక్ష్యం



వివరాలు వెల్లడిస్తున్న సదస్సు కన్వీనర్ డాక్టరు కిషోర్ పాణిగ్రాహి

- మొక్కల ఫొటోబయాలజీపై అంతర్జాతీయ సింపోజియం
- నైజర్ వేదికగా ఈ నెల 9న ప్రారంభం
- 17 ప్రపంచ దేశాల వైజ్ఞానికుల రాక

భువనేశ్వర్: వాతావరణ మార్పులు, వివిధ రకాల కాలుష్యం, ఇతర కారణాలు ప్రపంచ వ్యాప్తంగా ఆహార భద్రత, మానవాళికి పెను సవాలుగా పరిణమిస్తున్నాయి. ఈ పరిస్థితుల్ని అధిగమించి వైజ్ఞానికంగా ముందుకు సాగే సంకల్పంతో స్థానిక జాతీయ విజ్ఞాన విద్య, పరిశోధన సంస్థ(నైజర్) ప్రాంగణంలో అంతర్జాతీయ సదస్సు నిర్వహణకు రంగం సిద్ధమైంది. మొక్కల ఫోటోబయాలజీపై 11వ అంతర్జాతీయ సింపోజియం (ఐఎస్‌పీపీ) ఈ నెల 9 నుంచి ఆరంభమై 12వ తేదీ వరకు నాలుగు రోజులపాటు కొనసాగుతుందని డాక్టరు కిషోర్ పాణిగ్రాహి బుధవారం తెలిపారు.

తొలిసారిగా అమెరికాలో..

ఈ సదస్సు తొలి సారిగా అమెరికాలో 2001లో ప్రారంభమైంది. క్రమం తప్పకుండా ప్రపంచ దేశాల్లో ద్వైవార్షిక సదస్సుగా కొనసాగుతోంది. ఈసారి భారత్‌లోని ఒడిశా రాష్ట్రం ఖుర్దా జిల్లాలోని భువనేశ్వర్ జాతీయ విజ్ఞాన విద్య, పరిశోధన సంస్థ నైజర్ వేదికగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సదస్సు కన్వీనరు డాక్టరు కిషోర్ పాణిగ్రాహి, డాక్టరు సౌరవ్ దత్త, డాక్టరు చందన గోస్వామి, రిజిస్ట్రారు డాక్టరు అభయ్ నాయక్ సదస్సు వివరాలు వెల్లడించారు. రెండేళ్లకోసారి ఆసియా, అమెరికా, ఐరోపా శాస్త్రవేత్తల మధ్య స్వచ్ఛందంగా సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రముఖ సమూహాలు తీసుకున్న విభిన్న జీవసంబంధ సమస్యలను పరిష్కరించడానికి తాజా సాంకేతికతలు, విధానాలను మార్పిడి చేసుకోవడానికి కమ్యూనిటీకి సహాయపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమాన్ని యూరోపియన్ మాలిక్యులర్ బయాలజీ ఆర్గనైజేషన్ (ఎంబో) - జర్మనీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటమిక్ ఎనర్జీ (డీఏఈ), జాతీయ విజ్ఞాన విద్య, పరిశోధన సంస్థ (నైజర్), భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఐసీఏఆర్, సీఎస్ఐఆర్, ఎస్ఈఆర్‌బీ, డీబీటీ, ఐఎస్ఎస్‌పీ స్పాన్సర్ చేస్తున్నాయని వివరించారు. సుస్థిర అభివృద్ధి, సుస్థిర ఆర్థిక వ్యవస్థ, సుస్థిర ఉత్పత్తి, సుస్థిర ప్రపంచ ఆహార భద్రత కోసం ప్రపంచ వ్యాప్తంగా పరిశోధనలు కొనసాగిస్తున్న ప్రముఖులు ఈ సదస్సుకు విచ్చేస్తున్నారని తెలిపారు. వీరంతా ఉమ్మడి వేదికపై కలుసుకుని ఆహార ఉత్పత్తికి ముఖ్యమైన మొక్కల జీవశాస్త్రంలో వారి శాస్త్రీయ పరిశోధన అంశాల్ని ఒకరితో ఒకరు చర్చించుకుని ప్రపంచంలో తాండవిస్తున్న పలు ఆహార భద్రత, ఉత్పాదన తదితర అనుబంధ రంగాల్లో శాస్త్రీయ దృక్పథాలను ప్రతిపాదిస్తారని పేర్కొన్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత నాశనమైన మాంస ఉత్పత్తుల జోలికి వెళ్లకుండా ప్రత్యామ్నాయ ప్రొటీన్ మొక్కల ఉత్పత్తుల కోసం పోరాడుతున్న భారతదేశానికి మాత్రమే కాకుండా ఇతర అభివృద్ధి చెందిన దేశాలకు కూడా నేరుగా ప్రయోజనం చేకూర్చే పరిశోధనల్ని వైజ్ఞానిక వర్గాలు విశ్లేషిస్తాయని వివరించారు. ఈ సదస్సుకు దేశ, విదేశాల నుంచి 300 మంది పైబడి ప్రతినిధులు విచ్చేస్తున్నారని చెప్పారు. వర్ధమాన వైజ్ఞానిక యువతో ప్రత్యేకించిన అంశాలపై సుదీర్ఘంగా 3 నుంచి 4 గంటల పాటు చర్చించి పరిశోధనలో లోతుపాతుల్ని సూచిస్తారని వివరించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా

బరంపురం: నగరంలోని ఎంకేసీజీ మెడికల్ కళాశాలలో బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్, దివ్యజ్యోతి పరిడా సూచించారు. గంజాం జిల్లా కేంద్రం ఛత్రపూర్‌లోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అస్పత్రి అభివృద్ధిపై సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎంకేసీజీకి చికిత్స కోసం ప్రజలు ఎంతో నమ్మకంతో వస్తారన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా తగు సేవలు అందించాలని కోరారు. సమావేశంలో వివిధ ఆరోగ్య విభాగాలకు చెందిన ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ఘనంగా రోడ్డు భద్రతా వారోత్సవాలు



ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్‌టీఓ సంతను పరిడా



ర్యాలీలో పాల్గొన్న పాఠశాలల విద్యార్థులు

పర్లాకిమిడి: రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా పర్లాకిమిడిలోని రోడ్డు రవాణా కార్యాలయం వద్ద గురువారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్‌టీఓ సంతనుకుమార్ పరిడా మాట్లాడుతూ వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పిలుపునిచ్చారు. సెంచూరియన్ పబ్లిక్ స్కూల్, మహారాజా బాలుర ఉన్నత పాటశాల స్కౌట్స్ స్టూడెంట్స్, సరస్వతీ శిశు మందిర్ విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ ప్రకాష్‌చంద్ర సాహు, బెటాలియన్ కమాండెంట్ బెహరా, ఎంవీఐ తుషార్ హేంబ్రం, ట్రాఫిక్ ఎస్ఐ ప్రజ్ఞాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మొక్కలు ధ్వంసం



గంజాయి మొక్కలకు నిప్పు పెడుతున్న దృశ్యం

బరంపురం: గంజాం-కొందమాల్ జిల్లాల సరిహద్దుల్లో మంగళ, బుధవారం రెండు రోజులు అక్రమ గంజాయి సాగుపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. వందలాది ఎకరాల్లో సాగు చేస్తున్న తోటలను జిల్లా ఎక్సైజ్ విభాగం అధికారులు జిల్లా పోలీసుల సాయంతో ధ్వంసం చేశారు. అదేవిధంగా బల్లిగుడా పోలీసుస్టేషన్ పరిధి కామన్‌కులా అటవీ ప్రాంతంలో అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి మొక్కలను సైతం ధ్వంసం చేసినట్లు ఎస్పీ వినిత్ అగ్రవాల్ తెలియజేశారు.



గంజాయి పంటను ధ్వంసం చేస్తున్న అధికారులు

తొరాబొయి వద్ద పాసింజర్ హాల్ట్

భువనేశ్వర్: ఖుర్దా జిల్లా తొరాబొయి వద్ద పాసింజర్ హాల్ట్‌ను ప్రారంభించే ప్రతిపాదనకు రైల్వేశాఖ ఆమోదం తెలిపింది. ఖుర్దా రోడ్, ఖుర్దా టౌన్ స్టేషన్‌ల మధ్య తొరాబొయి వద్ద ఈ హాల్ట్‌ను ప్రారంభించేందుకు అనుమతినిచ్చినట్లు రైల్వే శాఖ తూర్పు కోస్తా రైల్వే జోన్ జనరల్ మేనేజర్ లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు రైల్వే బోర్డు అనుమతి పత్రం జోనల్ అధికారులకు జారీ అయినట్లు భువనేశ్వర్ లోక్ సభ ఎంపీ అపరాజిత షడంగి తెలిపారు.

చిలికా నడి బొడ్డున చిక్కుకున్న పడవ

భువనేశ్వర్: చిలికా సరసు నడి బొడ్డున పడవ చిక్కుకుంది. యాంత్రిక లోపంతో ఇలా జరిగినట్లు సమాచారం. పడవలో దాదాపు 25 మంది ప్రయాణికులు, 10 బైక్‌లు ఉన్నాయి. బుధవారం ఉదయం 10.30 గంటలకు సత్తాపాడా నుంచి చిలికా మీదుగా జొహ్నికుదా ఘాట్‌కు వెళ్తుండగా ఈ పడవ మొరాయించింది. దీంతో ప్రయాణికులు బిక్కుబిక్కుమంటున్నారు.

కుప్పకూలి హోంగార్డు మృతి

భువనేశ్వర్: శిక్షణ సమయంలో హోంగార్డు కుప్పకూలి మృతిచెందాడు. ఇతను బాసుదేవ్ మాన్‌సింగ్‌గా గుర్తించారు. స్థానిక రిజర్వ్ కార్యాలయం ఎదుట బుధవారం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. బాసుదేవ్ మాన్‌సింగ్ స్థానిక ఎయిర్‌ఫీల్డ్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. రిజర్వు కార్యాలయం ఎదురుగా ఉన్న మైదానంలో శిక్షణ కొనసాగుతోంది. జాగింగ్ చేస్తుండగా బాసుదేవ్ ఒక్కసారిగా కిందపడిపోయాడు. హుటాహుటిన చికిత్స కోసం బాసుదేవ్‌ను క్యాపిటల్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చనిపోయినట్లు వైద్యులు ప్రకటించారు. ప్రస్తుతం మృతదేహాన్ని క్యాపిటల్ ఆసుపత్రిలోనే ఉంచారు.

ఆదివాసీ కళలను పరిరక్షించుకోవాలి



వాయిద్య పరికరాలు పంపిణీ చేస్తున్న మంత్రి సరక తదితరులు

- మంత్రి జగన్నాథ సరక

రాయగడ: ఆదివాసీల భాష, సంస్కృతి, కళలను పరిరక్షించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక పిలుపునిచ్చారు. స్థానిక బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో స్వతంత్ర అభివృద్ధి మండలి(ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ఆదివాసీల సాంప్రదాయ వాయిద్యాలు, క్రీడాకారులకు క్రీడా పరికరాల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సరక మాట్లాడుతూ ఆదివాసీల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి రాష్ట్రంలోని 23 జిల్లాల్లో ఎస్‌డీసీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ సంస్థ ద్వారా ఆయా జిల్లాల్లో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే ఆదివాసీ ప్రాంతాల్లో సాంప్రదాయాలను రక్షించేందుకు విశేషంగా కృషి చేస్తోందన్నారు.

క్రీడల్లో రాణించాలి

గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో ప్రతి సమితిలో ప్రభుత్వం క్రీడా పోటీలు నిర్వహిస్తోందని తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను వెలికితీసేందుకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. క్రీడాకారులు, కళాకారులను ప్రోత్సహించేందుకు తొలి విడతగా ప్రభుత్వం క్రీడా సామగ్రి, ఆదివాసీ సాంప్రదాయ వాయిద్యాలను ఉచితంగా అందజేస్తోందని వెల్లడించారు. రాయగడ జిల్లాలో డొంగిరియా, లంజియా, కొండొ తదితర సాంప్రదాయలకు చెందినవారికి ఎస్‌డీసీ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ, వారిని ప్రోత్సహిస్తుండడం హర్షించదగ్గ విషయమన్నారు. రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి మాట్లాడుతూ ఆదివాసీల కళలు, వారి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలే వారికి గుర్తింపునిచ్చాయన్నారు. అందువల్ల వాటిని పరిరక్షించడం అందరి బాధ్యతగా తీసుకోవాలని కోరారు. ఎస్‌డీసీ చైర్మన్ అనసూయ మాఝి మాట్లాడుతూ ఆదివాసీల అభ్యున్నతికి ప్రభుత్వ పథకాలతో ఎస్‌డీసీ ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలోఆమో ఒడిశా నవీన్ ఒడిశా సమన్వయకర్త పట్నాన గౌరీ శంకరరావు, బీజేడీ జిల్లా అధ్యక్షుడు సుధీర్ దాస్, ఓబీసీ తెగల సంక్షేమ విభాగం రాష్ట్ర శాఖ ముఖ్య సలహాదారుడు పృథ్వీరాజ్ సాహు, సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్ర దేవి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, డీఆర్‌డీఏ కార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహరో, ఐటీడీఏ పీవో డాక్టర్ దిలీప్ కుమార్ బెహర, ఎస్‌డీసీ వైస్ చైర్మన్ బనమాలి కద్రక తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులు, క్రీడాకారులు

ఆదివాసీ మహిళ హత్యపై న్యాయవిచారణకు డిమాండ్



చంద్రపూర్‌లో పర్యటించిన సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకులు

రాయగడ: జిల్లాలోని చంద్రపూర్‌లో డిసెంబరు 21న దారుణ హత్యకు గురైన కాసీపూర్ సమితి లికిటిపాదొరొ గ్రామానికి చెందిన లక్ష్మీ మాఝి హత్య కేసుకు సంబంధించి న్యాయవిచారణ జరిపించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తిరుపతి గొమాంగో డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హత్య జరిగిన ప్రాంత్రాన్ని పార్టీ కార్యకర్తలతో కలిసి బుధవారం సందర్శించారు. అనంతరం ఎస్‌డీపీఓ ఓరతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గొమాంగో మాట్లాడుతూ ఆదివాసీలపై అత్యాచారాలు, హత్యలు అధికమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. కేసు దర్యాప్తులో జాప్యం జరిగితే నిందితులు తప్పించుకునే అవకాశం ఉందన్నారు. తక్షణ న్యాయవిచారణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు బృందావన్ బిడిక, జాన్ క్రేపుటికా, అదంగ్ ప్రాస్కా, కరుణాకర్ లిమ, సునీల్ ప్రాస్కా తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం మహతాబ్‌పై స్మారక నాణెం

భువనేశ్వర్: మాజీ సీఎం హరేకృష్ణ మహతాబ్ 125వ జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక స్మారక నాణేన్ని విడుదల చేయనుంది. ఈ విషయాన్ని మాజీ ముఖ్యమంత్రి కుమారుడు, కటక్ ఎంపీ భర్తృహరి మహతాబ్ మీడియా ప్రతినిధులకు బుధవారం తెలిపారు. స్వాధీనత సమర యోధుల దినం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ కేంద్రం నిర్ణయం గురించి తెలియజేసినట్లు తెలిపారు. ఒడిశాకు చెందిన దిగ్గజ నాయకుడి జ్ఞాపకార్థం ప్రత్యేక నాణేన్ని ముద్రించాలన్న సాంస్కృతిక శాఖ ప్రతిపాదనకు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపిందని ఎంపీ తెలిపారు. రూ.100 విలువ కలిగిన నాణెం ఇప్పటికే ముద్రించబడిందని భర్తృహరి తెలిపారు. మాజీ సీఎం మహతాబ్ 125వ జయంతి ఉత్సవాలు ముగిసేలోపు నాణేన్ని విడుదల చేస్తామని కేంద్ర మంత్రి తెలిపారు. ఆధునిక ఒడిశా రూపశిల్పిగా పరిగణించబడుతున్న మాజీ సీఎం మహతాబ్ 1946 నుండిచి 1950 వరకు మొదటి ముఖ్యమంత్రిగా, తదుపరి 1956 నుంచి 1960 వరకు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.

కొఠియా ప్రజలు ఒడిశా వైపే

కొరాపుట్: కొఠాయా ప్రజలు ఒడిశావాసులేనని రాష్ట్ర రెవెన్యూ, స్కూల్ శాఖా మంత్రి సుదాం మరండి, క్రీడా మంత్రి తుషార్ కాంతి బెహరా స్పష్టం చేశారు. బుధవారం కొరాపుట్ జిల్లా కేంద్రంలోని స్పెషల్ సర్క్యూట్ హౌస్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రా-ఒడిశా వివాదాస్పద ప్రాంతం కొఠియాలో జరుగుతున్న ఆంధ్ర రాజకీయ పార్టీల ప్రచారంపై మంత్రులు స్పందించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో వివిధ రాజకీయ పార్టీలు తమ ఉనికిని కాపాడుకోవడానికి కొటియాను అస్త్రంగా చేసుకుంటున్నాయని చెప్పారు. కొరాపుట్ జిల్లా యంత్రాంగం కొఠియాను అభివృద్ధి పథంలో ఉంచాయని తెలిపారు. ప్రజలు అభివృద్ధినే చూస్తారు తప్ప రాజకీయ విన్యాసాలను పట్టించుకోరని స్పష్టం చేవారు. ప్రజలంతా ఒడిశా వైపు ఉన్నప్పుడు వివాదం అనే ప్రశ్నే లేదన్నారు. అంతకుముందు కొరాపుట్ రైల్వే స్టేషన్‌లో మంత్రులకు ఎమ్మెల్యే రఘురాం పొడాల్, కేసీసీ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహీ ఘన స్వాగతం పలికారు. సర్క్యూట్ హౌస్‌లో బీజేడీ సీనియర్ నాయకులు, మంత్రులతో సమావేశమయ్యారు. అనంతరం మంత్రులు మల్కనగిరి జిల్లా పర్యటనకు బయలుదేరి వెళ్లారు.



కొరాపుట్ సర్క్యూట్ హౌస్‌లో మంత్రులు సుదాం మరండి, తుషార్ కాంతి బెహరా

క్లుప్తంగా

ఏడుగురు జూదరుల అరెస్టు



పోలీసులకు పట్టుబడిన పేకాటరాయుళ్లు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో బొంబాయి కాలనీలో ఓ ఇంట్లో జరుగుతున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఏడుగురిని అరెస్టు చేసి రూ.11,140 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి బుధవారం కోర్టులో హాజరుపర్చినట్లు మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్‌కీండో తెలిపారు.

యూత్ ఫెస్టివల్‌కు వర్సిటీ విద్యార్థులు



విద్యార్థులతో వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అడ్డయ్య

ఎచ్చెర్ల క్యాంపస్: యువభేరి పేరిట ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఈ నెల 5 నుంచి 9 వరకు సౌత్‌జోన్ యూత్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొందుకు వర్సిటీ అఫిలియేషన్ పరిధిలో ఐదు కళాశాలల్లో ఎంపిక చేసి వివిధ విద్యా, సాంస్కృతిక అంశాల్లో విద్యార్థులను ఎంపిక చేశారు. సంగీతం, నృత్యం, థియేటర్ ఆఫ్ ఆర్ట్స్, ఫైన్ ఆర్ట్స్, సాహిత్యం, క్విజ్, వ్యాసరచన విభాగాల్లో పాల్గొనే విద్యార్థులు బుధవారం వర్సిటీ అధికారులను కలిశారు. వీరిని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, అఫిలియేషన్ కళాశాల ఎంపిక కమిటీ సభ్యులు అభినందించారు. యువభేరిలో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని సూచించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వే స్టేషన్ సమీపంలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్పీ పోలీసులు బుధవారం తెలిపారు. మంగళవారం రాత్రి ఘటన జరిగిందని చెప్పారు. మృతుడి వయసు సుమారు 50 ఏళ్లు ఉంటుందని పేర్కొన్నారు. ఆకుపచ్చని ఫుల్ బనియన్, సిమెంట్ కలర్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జీఆర్పీ ఎస్సై ఎస్.కె.షరీఫ్ చెప్పారు. వివరాలు తెలిసినవారు జీఆర్‌పీ పోలీసులను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఆల్ ఇండియా టోర్నీకి అంపైర్‌గా శరత్



తుంగాన శరత్

కవిటి : హైదరాబాద్ ఆర్ఆర్‌సీ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న అండర్-19 ఆల్ ఇండియా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు అంపైర్‌గా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తుంగాన శరత్ ఎంపికయ్యాడు. ఈ మేరకు రాష్ట్ర సంఘం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయని జిల్లా సంఘం ఉపాధ్యక్షుడు తమరాల జయరాం గురువారం తెలిపారు. ఈ నెల 4 నుంచి 9 వరకు టోర్నీ జరుగుతుందని చెప్పారు.

కుమార్తెను హత్యచేసిన తండ్రికి జీవితఖైదు

ఆమదాలవలస/శ్రీకాకుళం పాతబస్టాండ్: కన్న కూతురిని కిరాతకంగా కత్తితో పొడిచి చంపి, భార్యను కూడా హత్యచేసేందుకు ప్రయత్నించిన కేసులో ముద్దాయి కొలుసు రామారావుకు శ్రీకాకుళం మూడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు, ఫ్యామిలీ కోర్టు జీవితకాలం జైలు శిక్ష, రూ.2500 జరిమానా విధించినట్లు జిల్లా పోలీసు కార్యాలయం నుంచి బుధవారం ప్రకటన విడుదలైంది. ఆమదాలవలస మున్సిపాలిటీ సొట్టవానిపేట, టి.జి.ఆర్.నగర్‌లో గత ఏడాది కొలుసు రామారావు తన కుమార్తెను హత్య చేశాడు. భార్యను చంపడానికి ప్రయత్నించాడు. అప్పట్లో ఆమదాలవలస పోలీసులు కేసు నమోదు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాన కృష్ణచంద్ ద్వారా సాక్షులను కోర్టులో హాజరుపరిచారు. ఎస్పీ జి.ఆర్. రాధిక పర్యవేక్షణలో ట్రయల్ నడిపి సాక్ష్యాధారాలు రుజువు చేయడంతో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధించారు. దర్యాప్తులో కీలకపాత్ర పోషించిన ఆమదాలవలస సీఐ పి.పైడయ్యను, కోర్టు మానిటరింగ్ పోలీసు సిబ్బందిని, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించినారు.

వైభవంగా పరమపదోత్సవం



వాసుదేవుని సన్నిధిలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మందస: పట్టణంలోని వాసుదేవ పెరుమాళ్ ఆలయంలో శ్రీనమ్మాళ్వార్ల పరమపదోత్సవం బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. గోదాదేవి సన్నిధిలోని శ్రీనమ్మాళ్వర్ల ఉత్సవమూర్తితో అర్చకులు ఆలయ పరక్రమణ చేసి, వాసుదేవుని మూలమూర్తి వద్దకు చేర్చారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వానమామలై పీఠం, వసనలవలస తిరుమల రంగనాథం అయ్యవార్లు, సచ్చిదానంద పాఢి పాల్గొన్నారు.

మరో ఎనిమిది ఉత్పత్తులకు జీఐ ట్యాగ్

భువనేశ్వర్: రాష్ట్రానికి చెందిన మరో ఎనిమిది ఉత్పత్తులకు భౌగోళిక సూచిక (జియోగ్రాఫికల్ ఇండికేషన్-జీఐ) మంజూరైంది. చెన్నైకి చెందిన రిజిస్ట్రీ ఈ జీఐ ట్యాగ్‌ని జారీ చేస్తోంది. ఈ జాబితాలో ఒడిశా ఖజూరి గొడొ (ఒడిశా కర్జూర బెల్లం), ఢెంకనాల్ మాగ్జి, సిమిలిపాల్ కొయి చట్నీ, నయాగడ్ ముళ్ల వంకాయ, డొంగొరొయా కోంధ్ ఎంబ్రాయిడరీ శాలువా, కొరాపుట్ కొలాజీర బియ్యం, పెయింటింగ్ ఆఫ్ లంజియా సొరా (ఇడిటల్) ఉన్నాయి. వీటితో రాష్ట్రంలో 25 ప్రత్యేక ఉత్పత్తులకు భౌగోళిక సూచిక లభించింది.

నయాగడ్ ముళ్ల వంకాయ



నయాగర్‌లోని కొంటిలొ ప్రాంతంలో పండే ముళ్ల వంకాయలు గింజలతో నిండి ఉంటాయి. తొడిమ ముళ్లను కలిగి ఉంటుంది. బొడొబొణొపూర్, రత్నపూర్ ప్రాంతాలలోని ఇసుక నేలలో పెరిగిన ఈ వంకాయలు ప్రత్యేకమైన రుచిని కలిగి ఉంటాయి.

గజపతి కర్జూర బెల్లం



గజపతి జిల్లాలోని ఒడిశా ఖజూరి గుడొ ఖర్జూర చెట్ల తీపి రసం (నీరా) నుంచి పొందిన సహజ తియ్యని పదార్థం. సంప్రదాయకంగా పాతాలీ బెల్లంగా వ్యవహరిస్తారు. ఇది పూర్తిగా సేంద్రీయమైనది. ముదురు గోధుమ రంగులో ప్రత్యేక రుచి కలిగి ఉంటుంది.

ఢెంకనాల్ మగ్జి




మాగ్జి గేదె పాల వెన్నతో దీనిని తయారు చేస్తారు. ఇది ఢెంకనాల్ జిల్లా గోండియా మండలంలో ప్రత్యేక ఉత్పాదన. దీనికి వందేళ్ల చరిత్ర ఉంది. ప్రాంతీయ సాహిత్యంలో ఈ మిఠాయి ప్రశంసలతో ఇమిడిపోయింది. భుబన్, మందార్, కాశీపూర్, సదాంగి, గోండియా, బిధర్‌పూర్, దేవగాంవ్, ఢెంకనాల్ పట్టణంలో మాగ్జి మిఠాయి అందుబాటులో లభిస్తుంది.

నల్ల జీరాబియ్యం.. కొలా జిరా



కొరాపుట్ జిల్లా తొల్ల, పత్రపుట్, పూజారిపుట్, బలిగుడ, మొహులి ప్రాంతాల్లో కొలాజిరా (నల్ల జీలకర్ర) వరిని పండిస్తారు. ఈ బియ్యం జ్ఞాపక శక్తిని మెరుగుపరిచి మధుమేహాన్ని నియంత్రిస్తుంది. హిమోగ్లోబిన్ స్థాయిలను, శరీర జీవక్రియను పెంచుతుందని నమ్ముతారు. కొలాజిరా వరి ప్రత్యేక సువాసన గల ధాన్యం యాంటిస్పాస్మోడిక్, కార్మినేటివ్, యాంటీ బాక్టీరియల్, ఆస్ట్రింజెంట్, మత్తు లక్షణాలను కలిగి ఉంటుంది.

మయూర్‌భంజ్ కొయి చట్నీ



కొయి చట్నీ మయూర్‌భంజ్ జిల్లాలో ప్రత్యేక తినుబండారంగా పేరొందింది. ఇది రుచికరమైనది కాకుండా ఔషధ ప్రయోజనాలు అందిస్తుంది. ఇందులో విలువైన ప్రొటీన్లు, కాల్షియం, జింక్, విటమిన్ బి-12, ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, సోడియం, కాపర్, ఫైబర్, 18 అమినో యాసిడ్‌లు పుష్కలంగా అందిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. వ్యాధులను నివారిస్తుంది. కామెర్లు, జలుబు, కీళ్ల నొప్పులు, దగ్గు, బలహీనమైన కంటి చూపుతో బాధపడేవారికి ఔషధంగా వినియోగిస్తారు.

డొంగొరియా కొంధొ శాలువా



డొంగొరియా కొంధొ ఎంబ్రాయిడరీ శాలువను ఎక్కువగా దుర్బల గిరిజన సమూహం (పీవీటీజీ) మహిళలు నేస్తారు. పెళ్లి కావలసిన యువతులు ఈ శాలువా నేతలో పాలుపంచుకోవడం గిరిజన సంప్రదాయంగా కొనసాగుతోంది. గౌరవం, ఆప్యాయత గుర్తుగా అతిథులకు కానుకగా సమర్పిస్తారు. దక్షిణ ఒడిశా రాయగడ, కలహండి జిల్లాల్లోని నియమగిరి కొండల్లో దీనిని తయారు చేస్తారు. ముడిసరుకుగా వినియోగించే తెల్లటి ముతక వస్త్రాన్ని స్థానిక షెడ్యూల్డ్ కులాల సంఘం డోంబ్ వర్గం నుంచి వస్తు మార్పిడి (బార్టరు) ద్వారా కొనుగోలు చేస్తారు. ఇందులో ఎంబ్రాయిడరీ ఆకర్షణీయం. మూడు వేర్వేరు రంగుల దారాలు వినియోగిస్తారు. ఆకుపచ్చ రంగు సారవంతమైన పర్వతాలు, కొండలను సూచిస్తాయి. పసుపు రంగు శాంతి, చిరునవ్వు, ఐక్యత, ఆరోగ్యం, ఆనందాన్ని సూచిస్తుంది. ఎరుపు రంగు ప్రతీకారం, రక్తం, శక్తి, శక్తి ప్రతీకగా వినియోగిస్తారు.

సవర పెయింటింగ్



రాయగడ జిల్లా దుర్బల గిరిజన సమూహం (పీవీటీజీ)లో ఒకటైన 'లంజియా సొర' (లంజియా సవర) తెగకు చెందినది. గిరిజనులు గృహాల వెలుపలి కుడ్యచిత్రాలు(వాల్ పెయింటింగ్)గా వెలుగులోకి వచ్చాయి. నవతరం ఈ సంప్రదాయ రంగుల కళను కాన్వాస్‌పై ప్రదర్శిస్తున్నారు. సాధారణంగా ఎర్ర మట్టితో అలికిన గోడలపై తెల్లని (ముగ్గు) రంగుతో ఇంటి గోడల్ని అలంకరించడం సంప్రదాయ ఆచారంగా వస్తోంది.

కేంద్రాపడా రాస్‌బాలి



రాస్‌బాలి మిఠాయి ప్రియులకు అత్యంత ప్రీతికరమైన వంటకం. 400 సంవత్సరాల ఘన చరిత్రతో చలామణి అవుతోంది. ప్రాచీన కాలం నుంచి కేంద్రపడి బాలదేవ్‌జీ దేవాలయంలో ప్రసాదంగా వినియోగిస్తున్నారు. చిక్కటి పాలలో నానిన ఛెన్నా (విరిగిన పాల జున్ను) మెత్తని రుచికరమైన తీపి వంటకం.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..!



శాంతాలి నృత్యంతో స్వాగతం

మల్కన్‌గిరి: జిల్లా స్టేడియంలో బుధవారం నువాఓ, యువ ఒడిశా, నవీన్ ఒడిశా కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి తుషార్‌కాంత్ బెహరా, రెవెన్యూ శాఖ మంత్రి సుధామ్ మరాండి, ప్రత్యేక అభివృద్ధి మండలి సలహాదారుడు ప్రదీప్ మాఝి, నవరంగ్‌పూర్ ఎంపీ రమేశ్‌చంద్ర మాఝి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సోమారి టాంగులు, చిత్రకొండ ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క, మల్కన్‌గిరి కలెక్టర్ విశాల్‌సింగ్, ఎస్పీ నితీస్ వాద్వానీ హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.



మల్కన్‌గిరి మార్షల్ ఆర్ట్స్ బృందం ప్రదర్శన



బహుమతులు పొందిన విద్యార్థులతో నిర్వాహకులు



విజేత జట్టుకు చెక్ అందజేస్తున్న నిర్వాహకులు

కొండచిలువ హతం



హతమైన కొండచిలువ

వజ్రపుకొత్తూరు/కాశీబుగ్గ: వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి బోడిమెట్టపై సుమారు పది అడుగుల కొండచిలువ బుధవారం హల్‌చల్ చేసింది. ఇదే ప్రాంతంలో గొర్రెలమందలు ఉండటంతో వాటిని రక్షించే క్రమంలో స్థానికులు కర్రలతో కొట్టి కొండచిలువను హతమార్చారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్

కొరాపుట్: సునాబెడా మున్సిపాలిటీ పరిధిలోని సిమిలిగుడ పట్టణంలో రోడ్ల నిర్మాణానికి బుధవారం కొరాపుట్ ఎమ్మెల్యే, జిల్లా ప్రణాళికా సంఘం అధ్యక్షుడు రఘురాం పొడాల్ శంకుస్థాపన చేశారు. రూ.1.20 కోట్లతో ఏడు రహదారుల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సునాబెడా పురపాలక సంఘ అధ్యక్షుడు రాజేంద్రకుమార్ పాత్రో, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ మందిర ప్రతిష్టాపన



పూజా కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

జయపురం: సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితి కొశాహండి గ్రామంలో బుధవారం సంకటమోచన హనుమాన్ మందిర ప్రతిష్టాపనకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, కొశాహండి శ్రీజగన్నాథ మందిర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి



అవగాహన రథం ప్రారంభిస్తున్న కలెక్టర్ కమలోచన్ మిశ్రా

కొరాపుట్ : రోడ్డు భద్రత సామాజిక లక్షణగా ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని నబరంగ్‌పూర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్రా పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలక్టరేట్‌లో రోడ్డు భద్రత వారోత్సవాల అవగాహన రథం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా రోడ్లు బాగున్నాయని, అయినా ప్రమాదాలు తగ్గడం లేదన్నారు. వాహనదారుల్లో చైతన్యం లేకపోవడమే ఇందుకు కారణమని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఎంలు మహేశ్వర్ చంద్రనాయక్, నవీన్ చంద్రనాయక్ పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత సావిత్రిబాయి పూలే

మహిళా విద్యాభున్నతికి విశేష కృషి చేసిన సావిత్రిబాయి పూలే చిరస్మరణీయురాలని వక్తలు కొనియాడారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా విద్యాసంస్థలు, కార్యాలయాల్లో ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మహిళా ఉపాధ్యాయులు, అధ్యాపకులను సత్కరించారు. సావిత్రిబాయి సేవలను కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



కత్తివరంలో సావిత్రిబాయి పూలే వేషధారణలో విద్యార్థిని లక్ష్మి ప్రసన్న



కాశీబుగ్గ: సత్కారం అందుకున్న పలాస ఇంటర్, డిగ్రీ మహిళా అధ్యాపకులు



శ్రీకాకుళం న్యూకాలనీ: హయాతీనగరంలోని గురుకుల పాఠశాలలో పూలే వేషధారణలో ఉన్న విద్యార్థినులతో ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి



కంచిలి: కత్తివరం ప్రాథమికోన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న టీచర్లు, గ్రామస్తులు

క్లుప్తంగా

ఎన్‌జీఓ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏపీ ఎన్‌జీఓ క్యాలెండర్‌ను కలెక్టర్ నిషాంత్‌కుమార్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తూ, అంకిత భావంతో విధులను నిర్వర్తించి జిల్లా అభివృద్ధికి తోడ్పాలన్నారు. ఉద్యోగులు సమన్వయం పాటించి ప్రభుత్వానికి సహకరించాలన్నారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు దుశ్శాలువతో కలెక్టర్‌ను సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ నాయకులు కిషోర్, వైవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ శాఖ డీడీగా అన్నదొర



పీఓ కల్పనాకుమారికి పుష్పగుచ్ఛాన్నిస్తున్న డీడీ అన్నదొర

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ డీడీగా ఎం.అన్నదొర బుధవారం నియమితులయ్యారు. అనంతపురం జిల్లాలో పనిచేస్తూ ఇక్కడకు పదోన్నతిపై వచ్చారు. ఐటీడీఏ పీఓ కల్పనాకుమారిని మర్యాదపూర్వకంగా కలిశారు. పీఓ మాట్లాడుతూ గిరిజన విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో భద్రగిరి బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యుగంధర్, సూపరింటెండెంట్ దేశ్ తదితరులు పాల్గొన్నారు.

9న పార్వతీపురంలో జాబ్ మేళా

పార్వతీపురం టౌన్: పార్వతీపురంలో ఈ నెల 9న జా బ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ బుధవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపా ధి కల్పనలో భాగంగా పదో తరగతి అర్హత కలిగిన దివ్యాంగ అభ్యర్థులకు ప్రత్యేకంగా ఈ మేళా నిర్వహిస్తున్నామని చెప్పారు. 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ దివ్యాంగులైన యువత ఈ మినీ జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. జాబ్ మేళాలో డీమార్ట్, మ్యాక్స్, రిలయన్స్, ట్రెండ్స్ కంపెనీ ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థుల ను వారి కంపెనీలకు ఎంపిక చేసుకోవడం జరుగుతుందని వివరించారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత తమ వివరాలను స్కిల్ యూనివర్స్.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరన్స్ నెంబర్‌తో పాటు సదరం సర్టిఫికెట్, బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్ ఒరిజనల్, జెరాక్స్, పాసుపోర్టు సైజ్ ఫొటోతో హాజరు కా వాలని కోరారు. వివరాలకు 7997299739 ఫోన్ నంబరును సంప్రదించాలని ఆయన సూచించారు.

మడ్డువలస నీటి విడుదల



కుడి కాలువ ద్వారా నీటిని విడిచి పెడుతున్న అధికారులు

వంగర: మండల పరిధి గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ద్వారా రబీ పంటల సాగుకు బుధవారం ప్రాజెక్టు అధికారులు నీటిని విడిచిపెట్టారు. డీఈ పి.అర్జున్ ఆధ్వర్యంలో హెడ్‌స్లూయిస్ వద్ద ప్రత్యేక పూజలు అనంతరం గేటు ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈ ఏడాది ఆయకట్టు పరిధిలో 13,500 ఎకరాల్లో ఆరుతడి పంటల సాగుకు నీటిని అందిస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. వంగర 996 ఎకరాలు, రేగిడి 5039 ఎకరాలు, సంతకవిటి 5965 ఎకరాలు, జి.సిగడాం 1500 ఎకరాలకు సాగునీటిని సరఫరా చేస్తామన్నారు. తొలుత 50 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టగా ఆయకట్టులో రైతులు నీటి అవసరాలు దృష్ట్యా 400 క్యూసెక్కుల వరకు పెంచుతామని డీఈ తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఏఈలు ఎ.సూర్య అన్వేష్, కె.నితిన్‌కుమార్, జి.అనీల్ కుమార్, బి.రవీంద్రలు పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయండి

- ఆర్‌డీఓ లావణ్య



ఆర్‌డీఓ లావణ్య

వీరఘట్టం: కార్డుదారులందరికీ రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని ఆర్‌డీఓ లావణ్య సూచించారు. ఈ మేరకు ఆమె బుధవారం వీరఘట్టంలో పలు రేషన్ డిపోలతో పాటు వాహనా లను తనిఖీ చేశారు. కార్డుదారుల నుంచి ఫిర్యాదులు రాకుండా అందరికీ సరుకులన్నీ అందజేయాలని సూచించారు. వీఆర్‌ఓలు రేషన్ సరుకుల పంపిణీని నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు.

'కోడ్' కూసే వరకూ... మొద్దునిద్రేనా..!

- పోలిపల్లి భూకుంభకోణంపై కదలని అధికార యంత్రాంగం
- నెల్లిమర్ల టీడీపీ ఇన్‌చార్జి బంగార్రాజు సోదరుడు సత్యం పాత్ర తేటతెల్లం
- అడ్డంగా దొరికినా చర్యలు తీసుకోకుండా ఉదాసీన వైఖరి
- ఎన్నికలు వచ్చేవరకూ సాగదీసి తర్వాత అటకెక్కించేసేలా మంత్రాంగం
- రెవెన్యూ శాఖలో ఓ కీలక అధికారి 'పరోక్ష' సహకారం?

సాక్షి ప్రతినిధి, విజయనగరం: నిద్రపోయేవాడిని నిద్ర లేపొచ్చు... నిద్రపోయినట్టు నటించేవాడిని నిద్ర లేపలేం! సరిగ్గా ఇదే వైఖరి పోలిపల్లి భూముల కుంభకోణంలో అతికినట్టు సరిపోతుంది! నెల్లిమర్ల నియోజకవర్గం భోగాపురం మండలం పోలిపల్లి గ్రామ పరిధిలో రూ.వందల కోట్ల విలువైన సామాన్యుల భూమిని ఫేక్ పట్టాలు, అధికారుల ఫోర్జరీ సంతకాలతో గుప్పిట పట్టిన టీడీపీ నాయకుల పట్ల రెవెన్యూ అధికారులు మొద్దునిద్ర నటిస్తున్నారనే చెప్పాలి. గత టీడీపీ పాలనలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని ప్రస్తుత ఆ పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు సోదరుడు, ఆ పార్టీ భోగాపురం మండల నాయకుడు కర్రోతు సత్యనారాయణ అలియాస్ సత్యం ప్రత్యక్షంగా, పరోక్షంగా చేసిన అక్రమాలను సాక్ష్యాధారాలతో 'సాక్షి' వెలుగులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ అక్రమాలకు అడ్డుకట్ట వేసి సామాన్యుల భూమికి రక్షణ కల్పించాల్సిన అధికారులకు మాత్రం చీమ కుట్టినట్లయినా లేదు. విచారణ జరిపి తమ భూమి తమకు ఇప్పించండి మహాప్రభో అంటూ పోలిపల్లి భూబాధితులు గగ్గోలు పెడుతున్నా చెవిలో సీసం పోసుకున్నట్టుగా వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నారు. భూ కుంభకోణం కారకులపై చర్యలు తీసుకోకుండా సార్వత్రిక ఎన్నికల వచ్చే వరకూ సాగదీస్తే... తర్వాత అటకెక్కించేయవచ్చనేదీ ఎత్తుగడగా కనిపిస్తోంది. అదో పాత కేసు అని, అవి రాజకీయాల కోసం రాస్తున్న కథనాలు అంటూ రెవెన్యూ శాఖలో ఓ కీలక అధికారి తనపై అధికారులను తప్పుదారి పట్టిస్తున్న వైనం వెనుక టీడీపీ గద్దల మంత్రాంగం ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నెల్లిమర్ల నియోజకవర్గం భోగాపురం మండల



జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న పోలిపల్లి వివాదాస్పద భూమి

టీడీపీ నాయకుడు కర్రోతు సత్యనారాయణ అలియాస్ సత్యం పోలిపల్లి రెవెన్యూ గ్రామ పరిధి సర్వే నంబర్లు 27/1, 27/2లోని 3.02 ఎకరాల భూమిని కబ్జా చేశాడని బాధితులైన తిరుమారెడ్డి ఆదినారాయణ, తిరుమారెడ్డి వెంకయ్య వారసులు ఏడాది కాలంగా గగ్గోలు పెడుతున్నారు. విజయనగరం ఆర్‌డీఓ కోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేశారు. ఆ భూమిపై మాజీ సైనికులైన ఓదూరి అప్పయ్య, రాలి నరసింగరావులకు ప్రభుత్వం పట్టా ఇస్తే... వారి నుంచి తాను కొనుగోలు చేశానని కర్రోతు సత్యం అదే అబద్ధాన్ని పదేపదే వల్లిస్తున్నారు. వాస్తవానికి లింగాలవలసకు చెందిన ఓదూరి అప్పయ్య గ్రామ సహాయకుడు (బారిక) అని, పోలిపల్లికి చెందిన రాలి నరసింగరావు వడ్రంగి అని బాధితులు చెబుతున్నారు. సత్యానికి భూమి విక్రయించినట్టుగా రిజిస్ట్రేషన్ చేసిన రాలి నరసింగరావు కుమారుడైన రాలి అన్నాజీరావు ప్రస్తుతం విశాఖనగరంలోని గోపాలపట్నం శ్రీరామనగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆయన్ను వెతుక్కుంటూ వెళ్లి బాధితులు నిలదీస్తే... అసలు తన తండ్రి సైనికుడు కాదని అసలు విషయం బయట పెట్టేశారట! అప్పట్లో కర్రోతు సత్యమే అంతా తాను చూసుకుంటానన్న హామీతో పాటు రూ.25 వేలు చేతిలో పెడితే దస్తావేజులపై సంతకం పెట్టాను తప్ప తనకేమీ తెలియదని చెప్పేశారట! కానీ ఇప్పటివరకూ రెవెన్యూ అధికారులు మాత్రం ఆ దిశగా దృష్టి పెట్టనేలేదు. కనీసం ఆ భూమిపై హక్కును నిరూపించుకోవడానికి ఉన్న ఆధారాలేమిటో చూపించాలని కర్రోతు సత్యానికి కనీసం ఇప్పటివరకూ నోటీసు జారీ చేసిన దాఖలాలు కూడా లేవని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కర్రోతు సత్యం కట్టుకథ

ల్యాండ్ క్యాపబిలిటీ క్లాసిఫికేషన్ (ఎల్‌సీసీ) నంబరు 1248/1975తో ఓదూరి అప్పయ్యకు 1.52 ఎకరాలు, ఎల్‌సీసీ నంబరు 1249/1975తో రాలి నరసింగరావుకు 1.50 ఎకరాల భూమిని మాజీ సైనికుల కోటాలో మంజూరు చేసినట్టు కర్రోతు సత్యం దస్తావేజుల్లో నమోదు చేయించారు. ఇందులో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే... అసైన్డ్ భూములను ఎవరికి కేటాయించాలనేదీ ఏపీ ల్యాండ్ సీలింగ్ యాక్ట్–1973 స్పష్టం చేస్తోంది. భూమిలేని పేద లకు వ్యవసాయం నిమిత్తం, పేదల ఇళ్ల పట్టాలకు మాత్రమే పంపిణీ చేయాలని నిర్దేశిస్తోంది. తర్వాత 1977 ఏప్రిల్ 29వ తేదీన 'ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ భూ ముల (బదిలీల నిషేధం) చట్టం–1977 అమల్లోకి వచ్చింది. ఈ చట్టం అమల్లోకి రావడానికి రెండేళ్ల ముందే మాజీ సైనికుల పేరిట సృష్టించిన పట్టాలు ఫేక్‌వని చెప్పడానికి ఇంతకన్నా సాక్ష్యం ఇకేమి కావాలి? జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న 3.02 ఎకరాల అత్యంత విలువైన భూమిని కర్రోతు సత్యం ఏ విధంగా కబ్జా చేసిందీ 'సాక్షి' ఇప్పటికే వెలుగులోకి తెచ్చింది. సర్వే నంబరు 27 పరిధిలోనే మరో 70 ఎకరాల భూమి ఆయన పరోక్ష సహకారంతో టీడీపీకి చెందిన పెత్తందారులు ఏ విధంగా కబ్జా చేసిందీ సాక్ష్యాధారాలతో సహా బట్టబయలు చేసింది.

అడ్వకేట్‌పై హత్యాయత్నం?

పోలిపల్లి భూబాధితుల తరఫున శ్రీకాకుళానికి చెందిన ఏపీ హైకోర్టు న్యాయవాది సంపతిరావు సుధాకర్ వాదిస్తున్నారు. గత ఏడాది జూలై 29వ తేదీన ఆయన ఎప్పటిలాగే విశాఖపట్నం కోర్టులో పనులు ముగించుకొని తన కారులో తిరుగు ప్రయాణమయ్యారు. జాతీయ రహదారిపై భోగాపురం మండలం పోలిపల్లి దాటిన తర్వాత నాతవలస టోల్‌గేట్ సమీపంలోకి వచ్చేసరికి ఒక భారీ వాహనం ఆయన కారును ఢీకొట్టింది. తృటిలో ప్రాణాపాయం తప్పింది. ఈ సంఘటనకు నెల రోజుల ముందే పోలిపల్లి భూ కుంభకోణంపై ఆర్‌డీఓ కోర్టులో కేసు విచారణకు వచ్చినప్పుడు భూమి బాధితులను, న్యాయవాది సుధాకర్‌ను ప్రత్యర్థులు బెదిరించారు. ఈ నేపథ్యంలో తనకు, పోలిపల్లి భూమి బాధితులకు పోలీసు రక్షణ కల్పించాలని కోరుతూ 2023 జూన్ 30వ తేదీన ఆర్‌డీఓ కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై ఇప్పటి వరకూ ఆర్‌డీఓ విచారణ జరపనేలేదని తెలిసింది. ఈ నేపథ్యంలోనే సుధాకర్‌పై దాడి జరగడం పలు సందేహాలకు తావిస్తోంది. గతంలో కబ్జాదారులు రౌడీలతో దాడి చేయించిన అనుభవాలను బట్టి చూస్తే ఈ వ్యవహారం వెనుక టీడీపీ నాయకులు ఉన్నారనే అనుమానాన్ని భూబాధితులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఏవిధంగా వారికి సాంత్వన చేకూర్చుతారో వేచి చూడాలి.



నాతవలస టోల్‌గేట్ సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంపై పోలీసులకు వివరిస్తున్న హైకోర్టు న్యాయవాది సంపతిరావు సుధాకర్ (ఫైల్)

సమగ్ర నివేదిక కోరాం...

పోలిపల్లి భూముల వ్యవహారంపై 'సాక్షి' కథనాలు మా దృష్టికి వచ్చాయి. ఈ కేసు ఇప్పటికే విజయనగరం ఆర్‌డీఓ కోర్టులో ఉందన్న విషయమూ తెలిసింది. పూర్తి వివరాలతో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆర్‌డీఓను కోరాం. ఇంకా ఆర్‌డీవో సమర్పించాల్సి ఉంది.

– ఎస్.నాగలక్ష్మి, విజయనగరం జిల్లా కలెక్టరు

రైతు ఖాతాలో ధాన్యం డబ్బు మాయం

- పోలీసులు, బ్యాంకు మేనేజర్‌కు ఫిర్యాదు చేసిన బాధితుడు



బ్యాంకు ఖాతాలో విత్‌డ్రా అయిన నగదు వివరాలు

వీరఘట్టం: మండలంలోని యు.వెంకమ్మపేటకు చెందిన రైతు శొంట్యాన సింహాచలం బ్యాంకు అకౌంట్‌లో పడిన ధాన్యం డబ్బుల్లో రూ.27 వేలను గుర్తు తెలియని వ్యక్తులు విత్‌డ్రా చేశారు. బుధవారం ఈ విషయాన్ని గుర్తించిన బాధితుడు పోలీసులు, బ్యాంకు మేనేజర్‌కు ఫిర్యాదు చేశాడు. ఆ రైతు ఇటీవల ప్రభుత్వానికి ధాన్యం విక్రయించగా అందుకు సంబంధించి రూ.55 వేలు వీరఘట్టం యూనియన్ బ్యాంకులో గల ఆయన అకౌంట్‌లో గత నెల 20వ తేదీన జమ అయ్యాయి.ఈ విషయాన్ని గుర్తించిన సైబర్ నేరగాళ్లు గత నెల 24 నుంచి 28వ తేదీ వరకు రోజుకు రూ.5 వేలు చొప్పున విత్‌డ్రా చేశారు.అలాగే ఈనెల 1వ తేదీన రూ.2 వేలు ఇలా మొత్తం రూ.27 వేలు విత్‌డ్రా చేశారు. అయితే ఆధార్ నంబర్ ద్వారానే కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో విత్‌డ్రా చేసి ఉండవచ్చునని బ్యాంకు సిబ్బంది చెబుతున్నారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పోయిన డబ్బులు తెప్పిస్తామని బ్యాంకు మేనేజర్ జయరాం భరోసా ఇచ్చారని బాధితుడు సింహాచలం తెలిపాడు. అయితే గతంలో కూడా వీరఘట్టం యూనియన్ బ్యాంకులో పలువురు ఖాతాదారుల సొమ్ము సైబర్ నేరగాళ్లు తస్కరించినప్పటికీ రికవరీ చేయలేదని అప్పటి బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బ్యాంకు అధికారులు కస్టమర్ సర్వీస్ సెంటర్లపై దృష్టి సారించి ఇటువంటి అవకతవలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

26 మంది ఎస్సైలకు స్థానచలనం

విజయనగరం క్రైమ్: జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో పనిచేస్తున్న 26 మంది ఎస్సైలకు స్థానచలనం కలిగిస్తూ ఎస్పీ ఎం.దీపిక బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు వీఆర్ అటాచ్డ్ వన్‌టౌన్ ఎస్సైలు ఎస్.భాస్కరరావును గుర్ల, డి.రామగణేష్‌ను నెల్లిమర్ల, ఆర్.గోపాల్ రావును ఎల్.కోట, రూరల్ ఎస్సైగా పనిచేస్తున్న బి.గణేష్‌ను ఆంధ్ర బదిలీ చేశారు. అదేవిధంగా గంట్యాడ ఎస్సై కిరణ్ కుమార్ నాయుడును చీపురుపల్లికి, భోగాపురం ఎస్సై కృష్ణమూర్తిని డెంకాడ, డెంకాడ ఎస్సై మహేష్‌ను గజపతినగరం, నెల్లిమర్ల ఎస్సై నారాయణరావును దిశ మహిళా పోలీస్‌స్టేషన్‌కు బదిలీచేశారు. ఎస్‌కోట ఎస్సై లోవరాజును బొబ్బిలి, కొత్తవలస ఎస్సై వైవీజనార్దన్‌ను వంగర, బొబ్బిలి ఎస్సైలు వి.జ్ఞానప్రసాద్‌ను రామభద్రపురం, బి.భాగ్యంను సీసీఎస్‌కు, రామభద్రపురం ఎస్సై బి.సురేంద్రనాయుడును గంట్యాడ, గజపతినగరం ఎస్సై సీహెచ్.గంగరాజును ఎస్.కోట, బొండపల్లి ఎస్సై ఎస్.రవిని సీసీఎస్ అటాచ్డ్ ఎలక్షన్ సెల్‌కు, గుర్ల ఎస్సై ఎస్.హరిబాబునాయుడును వన్‌టౌన్‌కు, రాజాం ఎస్సై పి.నీలావతిని దిశ మహిళా పీఎస్‌కు, రాజాం ఎస్సై వి.బి. రామకృష్ణారావును బొబ్బిలి ట్రాఫిక్‌కు బదిలీ చేశారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్ట్



నిందితుడితో డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐ,ఏఎస్సై

బాడంగి: కట్టుకున్న భార్య, నిండు గర్భిణిని పొలంలోని బావిలో తోసేసి ఆమె చావుకు కారణమైన భర్త వంగపండు రామారావును పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం బొబ్బిలి కోర్టుకు తరలించారు. ఈ మేరకు ఈ ఘటనపై డీఎస్పీ శ్రీధర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామారావుకు తొలి భార్య ఉండగానే పిల్లలు లేరన్న కారణంగా అన్నపూర్ణను రెండోపెళ్లి చేసుకున్నాడు. మూడేళ్ల అమ్మాయికూడా ఉంది. ప్రస్తుతం ఆమె మూడునెలల గర్భిణి. గతంలో ఇద్దరు భార్యలతో ఒకేఇంటిలో రామారావు ఉండేవాడు. తరచూ గొడవలు రావడంతో అన్నపూర్ణను వేరేఇంటిలో ఉంచి కాపురం చేసేవాడు. ఈక్రమంలో రెండోభార్యతో వచ్చిన మనస్పర్థలతో తరచూ గొడవలు జరుగుతుండడంతో విసిగిపోయిన భర్త జనవరి 1న రెండోభార్య అన్నపూర్ణతో కలిసి పొలానికి వెళ్లి నీరుకట్టే నెపంతో బావిలోకి ఆమెను తోసేశాడు. ఆరోజు పొద్దుపోయాక ఏమీతెలియనట్లు అత్తవారింటికి వెళ్లి మీ అమ్మాయి వచ్చిందా? అని ఆరా తీశాడు. ఆరాత్రి గడిచిన తరువాత మంగళవారం ఉదయం మృతురాలి తల్లి, బంధువులు అన్నపూర్ణ వెతికేందుకు చేసిన ప్రయత్నాల్లో భాగంగా పొలంలోని బావివద్ద చూడగా ఆమె శవమై కనిపించింది. దీంతో మృతురాలి తల్లి ఫిర్యాదుమేరకు నిందితుడు రామారావుపై కేసు నమోదు చేసి బొబ్బిలి సీఐ తిరుమలరావు పంచాయతీ కార్యదర్శి సమక్షంలో బుధవారం అరెస్ట్ చేశారు.

సీహెచ్‌సీల్లో మెరుగైన వైద్యసేవలు



గజపతినగరం ప్రాంతీయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

- ఏటా 10 లక్షల మందికి ఓపీ
- లక్ష నుంచి 1.30 లక్షల వరకు ఐపీ సేవలు
- 7 వేల వరకు మేజర్ ఆపరేషన్లు
- 15 వేల వరకు ప్రసవాలు

విజయనగరం ఫోర్ట్: జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన చర్యల కారణంగా వైద్యవిధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు బాగా మెరుగుపడ్డాయి. వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమించడం వల్ల రోగులకు సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయి. ఓపీ, ఐపీతో పాటు శస్త్రచికిత్సలు, ఇతర అన్ని రకాల సేవలు పెరిగాయి.

సౌకర్యాలు కల్పించిన ప్రభుత్వం

వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో ప్రభుత్వం మౌలికవసతులు కల్పించింది. ముఖ్యంగా ప్రతి సీహెచ్‌సీ, ప్రాంతీయ ఆస్పత్రిలో గైనకాలజిస్టు, పిడియాట్రిక్, అనస్తీషియా, జనరల్ ఫిజీషియన్, డెర్మటలాజీ, దంత, ఈఎన్‌టీ వైద్యులను నియమించింది. దీంతో అన్ని రకాల సేవలు అందుతున్నాయి.ఫలితంగా ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరిగింది. ప్రసవాలు, సిజేరియన్లు, ఇతర శస్త్రచికిత్సలు, వైద్య పరీక్షలు అల్ట్రాసౌండ్, ఈసీజీ వంటి సేవలు పెరిగాయి.

జిల్లాలో వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రులు

ఉమ్మడి విజయనగరం జిల్లాలో వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రులు (ఏరియా ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు) 14 ఉండేవి. ఉమ్మడి జిల్లా వేరుపడిన తరువాత ప్రస్తుతం విజయనగరం జిల్లాలో ఎస్.కోట ప్రాంతీయ ఆస్పత్రి, గజపతినగరం ప్రాంతీయ ఆస్పత్రి, సీహెచ్‌సీ బాడంగి, సీహెచ్‌సీ భోగాపురం, సీహెచ్‌సీ నెల్లిమర్ల, సీహెచ్‌సీ చీపురుపల్లి, సీహెచ్‌సీ బొబ్బిలి, రాజాం సీహెచ్‌సీ ఉన్నాయి.

ఏటా లక్షలమందికి సేవలు

వైద్యవిధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో ఏటా లక్షలాది మందికి వైద్య సేవలు అందిస్తున్నారు. 10 లక్షల మంది వరకు ఓపీ(ఔట్ పేషెంట్)సేవలు పొందుతున్నారు. అదేవిధంగా లక్ష నుంచి 1.30 లక్షల మందికి ఇన్‌పేషెంట్ (ఐపీ) సేవలు అందుతున్నాయి. 6 వేల నుంచి 7 వేల వరకు మేజర్ ఆపరేషన్లు చేస్తున్నారు. 14 వేల నుంచి 15 వేల వరకు ప్రసవాలు నిర్వహిస్తున్నారు. 35 వేల నుంచి 40వేల వరకు అల్ట్రాసౌండ్ స్కాన్ చేస్తున్నారు.11 లక్షల నుంచి 16 లక్షల వరకు వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఎక్స్‌రేలు 40 వేల నుంచి 43 వేల వరకు, 20 వేల నుంచి 23 వేల వరకు ఈసీజీలు తీస్తున్నారు.

మెరుగైన సేవలు

జిల్లా ఆస్పత్రి, ప్రాంతీయ ఆస్పత్రి, సీహెచ్‌సీల్లో వైద్యసేవలు మెరుగుపడ్డాయి. మేజర్ ఆపరేషన్లు, ప్రసవాలు, సిజేరియన్లు, వైద్య పరీక్షలు అన్ని గణనీయంగా పెరిగాయి. వైద్య సిబ్బంది చిత్తశుద్ధితో సేవలు అందిస్తున్నారు.

– డాక్టర్ బి. గౌరీశంకర్, డీసీహెచ్‌ఎస్

వైభవంగా పెదపోలమాంబ అనుపోత్సవం



అమ్మవారి ఘటాలకు ఉయ్యాల కంబాల నిర్వహిస్తున్న దృశ్యం



అమ్మవారికి మొక్కుబడులు చెల్లిస్తున్న భక్తులు



పెద్దమ్మవారి గుడికి చేరుకున్న ఘటాలు

మక్కువ: ఉత్తరాంధ్ర ఇలవేల్పు, శంబర పోలమాంబ అమ్మవారి మేనత్త పెద పోలమాంబ అనుపోత్సవం బుధవారం కనులపండువగా జరిగింది. బంగారు రంగుపూతతో అలంకరించిన అమ్మవారి ఘటాలు మంగళవారం సాయంత్రం తిరువీధికి బయలుదేరి, బుధవారం ఉదయం 11గంటలకు యాత్ర స్థలానికి చేరుకున్నాయి. యాత్రా స్థలం వద్ద అమ్మవారి ఘటాలకు ఉయ్యాలకంబాల నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యాలు, కోలాటం మధ్య, అమ్మవారి నామస్వరంతో జేజేలు పలుకుతూ అమ్మవారి గుడికి పెద్దమ్మవారి ఘటాలను తీసుకువెళ్లి పోలమాంబ వద్ద ఉంచారు. బుధవారం శంబర పోలమాంబ అమ్మవారిని కొని తెచ్చేందుకు సనప చాటింపు వేయించారు. అనుపోత్సవంలో గ్రామపెద్దలు రెవున్నాయి, ఆలయ కార్యనిర్వహణాధికారి వి.వి. సూర్యనారాయణ, ఎంపీటీసీ తీళ్ల పోలినాయుడు, మాజీ చైర్మన్ పూడి దాలినాయుడు, వసంతల భాస్కరరావు, గంజి కాశీనాయుడు, ఉపసర్పంచ్ అల్లు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ముసాయిదా ఓటరు జాబితాపై డిసెంబర్ 9 వరకు వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పరిష్కరించినట్లు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ముసాయిదా ఓటరు జాబితాపై 2023 డిసెంబర్ 9వ తేదీ వరకు వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పరిష్కరించినట్లు చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం లక్షా 91వేల793 ఫారాలు స్వీకరించగా వాటిలో లక్షా 83వేల 195 ఫారాలు పరిష్కరించి ఓటరు జాబితాలో చేర్చినట్లు తెలిపారు. 1473 ఆమోదించామని, 5164 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని, 1961 పరిష్కరించవలసి ఉందని వివరించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లాలో శాశ్వత సెంటర్లు, మొబైల్ ప్రదర్శన వ్యాన్లు ఏర్పాటు చేశామని, జిల్లా ఎన్నికల కార్యాలయం, రిటర్నింగ్ అధికారి ప్రధాన కార్యాలయం లేదా రెవెన్యూ సబ్‌డివిజన్ అధికారుల వద్ద శాశ్వత సెంటర్లు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మొబైల్ ప్రదర్శన వ్యాన్ ఏర్పాటు చేశామని, మొబైల్ వ్యాన్ షెడ్యూల్ ముందుగా తెలియజేయనున్నామని ఓటర్లు కార్యక్రమంలో పాల్గొనేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రోత్సహించాలని కలెక్టర్ కోరారు.

ప్రభుత్వ స్థలంలో పాకలు

- నుగర్ కాటా స్థలం అక్రమణ
- తొలగించాలని అధికారుల హెచ్చరిక
- వదిలేది లేదని తేల్చిచెప్పిన ఆక్రమణదారులు



ప్రభుత్వ స్థలంలో ఆక్రమణదారులు కట్టిన పాకలు



ఆక్రమణదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ తదితరులు

శృంగవరపుకోట: చెరుకు కాటాకు చెందిన స్థలం ఆక్రమించారని రైతులు..ఇళ్లు లేని తాము ప్రభుత్వ భూముల్లో పాకలు వేసుకుంటే రైతులకు కడుపు మంట ఎందుకంటూ ఆక్రమణదారులు..ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే ఎలా ఊరుకుంటామని రెవెన్యూ అధికారుల వాదోపవాదాలతో స్థానిక చెరుకు కాటా వద్ద బుధవారం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పట్టణంలోని చెరుకు కాటాను ఆనుకుని ఉన్న స్థలంలో సుమారు 20 మంది మంగళవారం నాటికే పాకలు వేసేందుకు సిద్ధమయ్యారు. ఎస్.కోట చెరుకు కాటాస్థలం కబ్జా చేస్తున్నారని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని భీమసింగి చక్కెర కర్మాగారం ఎం.డి నుంచి తహసీల్దార్‌కు మంగళవారం ఫిర్యాదు రావడంతో పాకలు వేయడానికి వీల్లేదంటూ వీఆర్వోలను తహసీల్దార్ ఆదేశించారు. అయితే బుధవారానికి 20మంది అదే స్థలంలో కొయ్యలతో పాకలుకట్టి డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ ఫ్లెక్సీలు పెట్టారు. వీఆర్వోలు, వీఆర్‌ఏలు, ఎస్.కోట ఎస్సై లోవరాజు, హెచ్‌సీ, కానిస్టేబుల్స్ గెడ్డస్థలంలో పాకలు తీసేందుకు జేసీబీతో వెళ్లగా వారిని ఆక్రమణదారులు అడ్డుకున్నారు. దీంతో తహసీల్దార్ శ్రీనివాసరావు వివాదస్థలానికి రాగా, ఆక్రమణదారులు మాట్లాడుతూ కాటా స్థలం హద్దులు తేల్చితే, ఈ స్థలం కాటాకు చెందినదైతే ఖాళీ చేస్తామని, ప్రభుత్వ స్థలం అయితే అక్కడే పాకలు కట్టుకుని నివాసం ఉంటామని తేల్చిచెప్పారు. ఆ సమయంలో రైతులు–ఆక్రమణదారుల మధ్య, అధికారులు–ఆక్రమణదారుల మధ్య వాదోపవాదాలతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ప్రభుత్వ స్థలం ఆక్రమణ నేరమని ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేనివారికి 90రోజుల ప్రోగ్రాంలో ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని తహసీల్దార్ చెప్పినా, ఆక్రమణదారులు ససేమిరా అన్నారు. ఎట్టకేలకు గురువారం ఉదయం తన కార్యాలయంలో హాజరు కావాలని ఆక్రమణదారులకు తహసీల్దార్ చెప్పి వెనుదిరిగారు.